క్లుప్తంగా

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామికి అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భజనలు చేశారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన భక్తులుస్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నెలబల్లి దర్గాలో భక్తుల తాకిడి



నెలబల్లి దర్గాలో ప్రత్యేక పూజలు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామంలో వెలసిన శ్రీహుస్సేనమ్మ దర్గాలో భక్తుల తాడికి మొదలైంది. బుధవారం బయట ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ముస్లింలు దర్గాలో ఫాతేహాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్గాలో మూడు రోజుల పాటు 54వ గంధోత్సవం నిర్వహించనున్నారు.

అధిక ధరలకు పుస్తకాల విక్రయం



ఏంఈఓ మునిరత్నంకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నాయుడుపేట టౌన్ : ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. వారు బుధవారం ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లా డుతూ పట్టణంలోని అన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు కార్పొరేట్ స్థాయిలో ప్రచారం చేస్తూ అధిక ఫీజులు వసూలుచేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు చర్యలు చేపట్టపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం ఎంఈవో మునిరత్నంకు వినతి పత్రమిచ్చారు. నేతలు తడుకు చందు, వినయ్, వెంకట్ పాల్గొన్నారు.



చేపలకు మేత వేసేందుకు చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గుడిసె



చెరువులో చేపలు పట్టేందుకు సిద్ధం చేసిన మరబోటు

అన్యాక్రాంతమవుతున్న మత్స్య సంపద

- అక్రమంగా చెరువుల వేలం పాటలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



నీటితో కళకళలాడుతున్న చెరువు

పెళ్లకూరు: మండలంలో ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పలు గ్రామాల్లో పెత్తందారులు మత్స్య సంపదను దోచేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతియేటా చెరువుల్లో నీటి సామర్థ్యం ప్రకారం చేపలు పెంచుకోవడానికి జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ పాలక వర్గం సమక్షంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించాలి. వేలం ద్వారా వచ్చే రాబడిని పంచాయతీలో అభివృద్ధి పనులకు వినియోగించాలి. మండలంలోని 24 పంచాయతీల్లో 26 మైనర్ ఇరిగేషన్, మరో 28 చిన్న చెరువులు ఉన్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లో సామర్థ్యం మేర సాగునీరు ఉంది. దీంతో చేపల పెంపకానికి గుంటూరు, విజయవాడ, చిత్తూరు, కడప తదితర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యాపారులు చెరువులను చేజిక్కించుకోవడానికి ఇక్కడ పోటీ పడుతున్నారు. అధికారులు, పంచాయతీ పాలకులకు సమాచారం లేకుండా ఇప్పటికే చెంబేడు, శిరసనంబేడు, చిల్లకూరు, పెళ్లకూరు, కొత్తూరు, నందిమాల తదితర గ్రామాల్లోని పలు చెరువులకు అక్రమంగా వేలంపాటలు నిర్వహించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో చెరువును రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు వేలం పాటలు నిర్వహించినట్లు సమాచారం . ఈ క్రమంలోనే అక్రమ వేలం పాటల ద్వారా చేజిక్కించుకున్న వ్యాపారులు చెరువుల్లో చేపలు పట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలోని పలు చెరువులకు అక్రమంగా వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎప్పటికప్పుడు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు విలువ చేసే చెరువులకు రూ.20 వేలను చేపల వేలం కింద పంచాయతీకి జమ చేస్తున్నట్లు సమాచారం. పంచాయతీ ఆదాయానికి గండి పడుతున్నా ఇక్కడి అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పుల్లూరు చెరువుకు కొన్నేళ్లుగా వేలం నిర్వహించకపోవడంతో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు చేపలు పట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారు.



పట్టిన చేపలను మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధం చేస్తున్న వ్యాపారులు

వేసవిలో మూగజీవాలకు కష్టం

మండలంలోని చెరువులను వేలం పాటలతో వ్యాపారులు చేజిక్కించుకుంటున్నారు. వారు చేపలు పట్టేందుకు చెరువుల నుంచి నీటిని వృథాగా కిందకు వదిలేస్తున్నారు. దీంతో వేసవి కాలంలో మూగజీవాలకు నీటి సౌకర్యం కరువై కష్టాలు తప్పడం లేదు. అంతేకాకుండా సాగు ప్రారంభ సమయంలో వరినారు మడులకు, పొలం దుక్కి చేసుకోవడానికి సాగునీరు లేకపోవడంతో పలు ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

> **అనధికార వేలం పాటలు చెల్లవు**
>
> చెరువుల్లో చేపలు పట్టుకోవడానికి గ్రామాల్లో పెత్తందారులు నిర్వహించే అనధికార వేలం పాటలు చెల్లవు. వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మత్స్యసంవర్ధక శాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – అన్నపూర్ణరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, పెళ్లకూరు

వ్యవసాయ విద్యుత్ మోటార్ కేబుల్ చోరీ

వాకాడు : మండలంలోని కాశీపురం సమీపంలోని పొలాల్లో మంగళవారం రాత్రి వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. వారు మాట్లాడుతూ వ్యవసాయానికి పగటిపూట కరెంటు కావడంతో సాయంత్రం వరకు పొలాలకు నీరు పారగట్టుకుని ఇంటికి వెళుతున్నామని తెలిపారు. రాత్రిళ్లు గుర్తు తెలియని వ్యక్తులు 10 మంది రైతులకు సంబంధించిన మోటార్ వైర్లు చోరీ చేశారని వాపోయారు. ఒక్కో రైతుకు సంబంధించి సుమారు 120 నుంచి 150 మీటర్ల వైర్లు చోరీ చేసినట్టు తెలిపారు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం కలిగిందని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

కోర్టు ప్రాంగణంలో చెట్ల వేలం

కోట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఉన్న చెట్లను ఈ నెల 22వ తేదీన వేలం వేయనున్నట్టు సిబ్బంది బుధవారం తెలిపారు. గత ఏడాది మిచాంగ్ తుపాను ప్రభావంతో కోర్టు ప్రాంగణంలో ఉన్న చెట్లు నేలకొరిగాయని పేర్కొన్నారు. వీటిలో విలువైన టేకు చెట్లు ఉన్నాయి. జడ్జి భరత్ కమాల్ ఆదేశాల మేరకు టేకు, ఇతర చెట్లను వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు తమ ఆధార్‌కార్డును తీసుకుని రావాలన్నారు. వేలంపాటలో ఎక్కువ ధర చెల్లించిన వారికి చెట్లను స్వాధీనం చేస్తామన్నారు.

21న సాయిబాబా మందిరం వార్షికోత్సవం

రాపూరు: రాపూరులోని షిరిడీ సాయిబాబా మందిరం 34వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సాయినాథునికి ఉదయం కాగడహారతి, అభిషేకాలు, బాబా జీవిత చరిత్ర పారాయణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి సేవ, భజన తదితర కార్యాక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కండలేరులో 6.410 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు కిలివేటి పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేతను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మొదిలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరింబాయి చెంచయ్యను బుధవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. చెంచయ్య కంటికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంజీవయ్య వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాయకులు మెస్ భాస్కర్ రెడ్డి, నిడిగింటి చిట్టిబాబు, డాక్టర్ అలీ, కౌన్సిలర్లు కావేరిపాకం అశోక్‌కుమార్, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంపీడీవోకు ఘన సన్మానం



విశ్రాంత ఎంపీడీవో ఆమోసుబాబును సన్మానిస్తున్న తడ మండల పీఆర్ సిబ్బంది

తడ: మండల ఎంపీడీవోగా పనిచేస్తూ మే 31న ఉద్యోగ విరమణ చేసిన ఆమోసు బాబును బుధవారం తడ పంచాయతీ రాజ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. 1986లో టైపిస్టుగా చేరిన ఆమోసు బాబు అంచెలంచెలుగా ఎదిగి నెల్లూరు జెడ్పీ కార్యాలయంలో ప్లానింగ్ అధికారిగా, అనంతరం రాపూరు ఎంపీడీవోగా ప్రమోషన్ పొందారు. తదనంతరం తడ మండలానికి ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. 13 నెలల పాటు సేవలందించారు. ఉద్యోగ విరమణ చేసిన సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఆయన వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తడ, రాపూరు పంచాయతీ కార్యాలయ సిబ్బందితోపాటు నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై ఆమోసు బాబు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను గజమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంపీపీ కొళవి రఘురెడ్డి, వైస్ ఎంపీపీ కే వెంకటేష్, జెడ్పీ ఏవో సుబ్బారావు, ఎంఈవో మల్లికార్జునరావు, డీఈ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ శరత్, సర్పంచులు కె.ఆర్ముగం, పరమశివంరెడ్డి, ఆర్కే సుందర్‌రెడ్డి, రమణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం మృతి బాధాకరం

నాయుడుపేట టౌన్ : అందరితో ఎంతో సఖ్యతగా మేలిగే హెచ్‌ఎం సయ్యద్ బాబు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేటలోని ఎస్వీటీ థియేటర్ సమీపంలో ఉన్న హెచ్‌ఎం బాబు నివాసం వద్ద బుధవారం నిర్వహించిన అంత్యక్రియల్లో కిలివేటి సంజీవయ్య తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. సయ్యద్‌బాబుకు నివాళులర్పించారు. నాయుడుపేట మండలంతో పాటు చుట్టు పక్కల మండలాలకు చెందిన అనేక మంది ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, ముస్లిం మైనారిటీ నాయకులు, మత పెద్దలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెళ్లకూరు: బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య తెలిపారు. ఆయన బుధవారం చెంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ×నేను బడికి పోతా× కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో చేశారు. ఎంఈవో మాట్లాడుతూ బడి వయస్సు కలిగిన పిల్లలందరూ బడిలోనే ఉండాలని, శ్రద్ధగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా సీఆర్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ యోగీశ్వరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేను బడికి పోతా కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఘనంగా పోలేరమ్మ జాతర





కుమ్మరి ఇంటి వద్ద కొలువుదీరిన పోలేరమ్మ, ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారి ఆలయం





విశేషంగా ఆకట్టుకుంటున్న విద్యుత్ దీపాలంకరణ

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని బంగారుపేటలో పోలేరమ్మ జాతర అంతరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా కుమ్మరి వీధిలో అమ్మవారి ప్రతిమను తయారు చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా అమ్మవారిని మెట్టినిల్లు అయిన రజక నివాసం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారిని కల్లు, దిష్టి చుక్కతో అలంకరించి ప్రత్యేక పూల వాహనంలో కొలువుదీర్చి అశేష జన సందోహం మధ్య ఆలయం వద్దకు తీసుకువచ్చారు.



జాతరలో పాల్గొన్న యువత

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అమ్మవారి జాతరలో భాగంగా బంగారుపేట చావడి వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేరళ వాయిద్యాలు, ప్రత్యేక వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు, ఇతర దేశాల్లో స్థిర పడిన స్థానికులు జాతర సందర్భంగా స్వగ్రామాలకు చేరుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కళాకారుల కేరళ నృత్యాలు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు

శిథిలావస్థలో తుపాను షెల్టర్లు

- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న స్థానికులు
- తుపాను వచ్చినప్పుడు ఉపయోగంగా ఉంటాయని అంటున్న వైనం

దొరవారిసత్రం : విపత్తుల నుంచి తీర గ్రామాల్లోని ప్రజలను కాపాడే నిమిత్తం అన్ని సదుపాయాలతో నిర్మించిన తుపాను షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు చేపడితే అన్ని రకాలుగా ఉపయోగపడతాయని స్థానికులు చెబుతున్నారు. దొరవారిసత్రం మండలంలోని తీర గ్రామాలైన మీజూరు, నాగినేరి, కారికాడు, వేలికాడు గ్రామాల ప్రజల సౌకర్యార్థం కారికాడు, వేలికాడు గ్రామాల్లో 25 ఏళ్ల క్రితం రెండు తుపాను షెల్టర్లు నిర్మించారు. నిర్వహణ చేపట్టకపోవడంతో పదేళ్ల కిందటే మరమ్మతులకు గురయ్యాయి. అధికారులు పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రస్తుతం కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. లోపలి భాగంలో మెట్లు, గోడలు క్రమేపీ దెబ్బతింటున్నాయి. ప్రతి ఏటా తుపాను హెచ్చరికలు వచ్చిన సమయంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులు తీర గ్రామాల్లో పర్యాటించడం, షెల్టర్లను సందర్శించి వెళ్లడం తప్ప వాటి మరమ్మతుల గురించి పట్టింకున్న దాఖలాలులేవు. ఎప్పటికప్పుడు తీర గ్రామాల్లో పర్యటించే అధికారులు తుపాను షెల్టర్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించడం తప్ప ఫలితం లేకుండాపోతుందని తీర ప్రాంత ప్రజలు వాపోతున్నారు.



కారికాడు ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న తుపాను షెల్టర్ భవనం



వేలికాడు ప్రాంతంలోని తుపాను షెల్టర్ భవనం

అప్పటిలోనే ఫోన్లు, మరుగు దొడ్లు సదుపాయం

కారికాడు, వేలికాడు గ్రామాల్లో నిర్మించిన తుపాను షెల్టర్ల వద్ద టవర్లు ఏర్పాటు చేసి ఫోన్ల సదుపాయం కల్పించారు. అదే విధంగా మరుగుదొడ్లు కూడా నిర్మించారు. నేడు అన్నీ శిథిలాస్థకు చేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులకు నిధులు కేటాయించి తుపాను షెల్టర్లను వినియోగంలోకి తీసురావాలని స్థానికులు కోరుతున్నారు.



షెల్టర్‌లో దెబ్బతిన్న మెట్లు, గోడ